

# మగువ మనసు ... 'శ్రావణి'

**"చూడు, హీరో! ఆ అమ్మాయి ఇప్పుడు నీ బట్టలు పట్టుకెళ్లడానికి వస్తుంది కదా! నెమ్మదిగా విషయం మాట్లాడు. తరువాత నా విషయం కూడా చెప్పు. ఈలోపులో నేను బయట కాలక్షేపం చేసి వస్తాను" అన్నాడు కొలీగ్ రామారావు.**

అసలు విషయ మేమిటంటే కాలేజి చదువు వెలగబెట్టే రోజులలో నాలుగు గదుల్లో స్టూడెంట్సు అద్దెకుండేవారు. హీరో రూమ్‌లో ఉండే ఇద్దరు స్టూడెంట్సుకు మాసిన బట్టలు తీసుకెళ్లడానికి ఒక ఇరవై సంవత్సరాల ప్రాయంలో మిసమిసలాడే ఒకమ్మాయి వచ్చేది. అయితే మిగతా స్టూడెంట్సు కూడా ఆ అమ్మాయికి బట్టలు వెయ్యడానికి ప్రయత్నించినా ఆమె అంగీకరించలేదు. అందరి కళ్లు ఆమెమీదే ఉండేవి. హీరో మీద అసూయ కూడా ఉండేది.

ఇంతలో కాలేజికి సెలవు లివ్వడంతో మిగతా గదులలో వాళ్లంతా ఖాళీ చేసి వాళ్ల ఊళ్లకు వెళ్లిపోవడం జరిగింది. కానీ హీరోకు, రామారావుకు మాత్రం ఇంకా పరీక్షలు పూర్తవలేదు.

ఆ రోజు ఆ అమ్మాయి వస్తుందని తెలిసి రామారావు ఆ అమ్మాయిని ఎలాగైనా ఒప్పించమని హీరోకు చెప్పి బయటకు వెళ్లిపోయాడు.

ఆ పిల్ల రానే వచ్చింది. హీరో రూమ్ ముందు నిలబడింది. ప్రస్తావన ఎలా ప్రారంభించాలా అని హీరో భయపడుతున్నాడు. ఆ యువతి నిలబడ్డచోట కొంచెం ఎండగా ఉండడంతో, "అలా ఎండలో నించున్నావే! గదిలోకి రా!" అన్నాడు కొంచెం తన అభిప్రాయం వ్యక్తపరచడానికి.

ఆమె కదలలేదు. రెండవసారి మళ్లీ "భయం లేదు, లోపలికి రా!" అన్నాడు హీరో.

"మీరు ఎందుకు గదిలోకి రమ్మంటున్నారో నాకు అర్థమైందండీ! మేము అలాంటి వాళ్లం కాదు. బట్టలు వేస్తారా, లేదా?" అని కొంచెం కోపం చూపించి వెళ్లిపోయింది.

వెళ్లిపోతున్న అమ్మాయిని చూసిన రామారావు గబగబా రూముకి వచ్చి, "ఏం, హీరో, అప్పుడే పంపించేసేవే! నా మాట చెప్పలేదా?" అని అడిగాడు.

"ఇంకా నయం...నా పరువు తియ్యలేదు! గౌరవంగా వెళ్లిపోయింది. అసలు విషయం ప్రస్తావనే రాలేదు!" అంటూ జరిగిన విషయం చెప్పాడు హీరో.

"పోనీలే, జరిగిందేదో జరిగిపోయింది. ఎవరితోనూ చెప్పకు!" అన్నాడు రామారావు చిన్నబుచ్చుకుంటూ - గుంభనంగా.

ఆమె మరునాడు మళ్లీ వచ్చింది బట్టలు వెయ్యమంటూ. గప్‌చిప్‌గా మాసిన బట్టలు వేశాడు హీరో.

అలా వీధి గుమ్మం దగ్గరకు రమ్మన్నట్లు సంజ్ఞ చేసింది హీరోకు. కూడా వెళ్లాడు. "రాత్రి మా ఇంటికి రండి!" అంది నవ్వుతూ.

"ఎందుకు?" అన్నాడు హీరో.

"మీకు ఏం కావాలని నన్ను గదిలోకి రమ్మన్నారో అందుకు!" అంది.

హీరోకు మతిపోయింది. ఏం చేయాలో తెలియడంలేదు. అంతకుముందు అటువంటి అనుభవాలు లేవు కదా! ఇంకొక మిత్రుడు వెంకట్రావు వస్తే జరిగిన విషయం చెప్పి, "ఏం చేయమంటావురా?" అని అడిగాడు.

"ఒరేయ్! ఇంకా ఆలోచిస్తున్నావా? ఈ రాత్రే వెళ్లు. అంత అందమైన పిల్ల నిన్ను వలచి పిలిస్తే సందేహించడమా? పోనీ, నన్ను కూడా రమ్మంటే వస్తాను నీకు సాయంగా!" అన్నాడు వెంకట్రావు.

హీరో కొంచెం ఆలోచించి, "పోనీ, రా ... తోడుగా ఉంటావు!" అన్నాడు అమాయకంగా.

ఇద్దరూ ఆ అమ్మాయి ఇంటివైపు వెళ్లారు. ఆ ప్రాంతంలో కుక్కలు మొరుగుతున్నాయి. కొంచెం దూరంలో ఒకింట్లో భజన జరుగుతోంది. రెండుసార్లు అటూ, ఇటూ తిరిగి ఆ ఇంటి గది దగ్గరకు వెళ్లాడు హీరో. ఆ అమ్మాయి అలికిడి విని హీరోకేసి చూసింది. దూరంగా నిలబడ్డ వెంకట్రావును కూడా గమనించింది.

"అప్పుడే వచ్చేశారేంటి? ఇంకా ఎనిమిది కూడా అవలేదే! అయినా మీ కూడా ఆయ నెందుకొచ్చాడు. ఇంకో గంట పోయేక మీ రొక్కరే రండి! ఇక్కడే ఉంటాను!" అని, హీరో చేతికి ఏదో ఒక దుప్పటి ఇచ్చి పంపించేసింది ఎవరికీ అనుమానం లేకుండా.

హీరో బయటికొచ్చి మిత్రుడు వెంకట్రావుకు విషయం చెప్పి గప్‌చిప్‌గా రూముకి చేరుకున్నారు.

తరువాత ఏం జరిగిందనే విషయం చెప్పే అవసరం లేదనుకుంటా!